AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
1-10-2025 (Wednesday) MAIN EDITION

## అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అక్కడ రెండు బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. ఈ మేరకు వైట్‌హౌస్ ప్రకటన చేసింది. అమెరికా తర్వాతి ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధుల బిల్లులను సెనెట్ ఆమోదించలేదు. దీంతో షట్‌డౌన్ అమలులోకి వచ్చింది. అయితే ఇది ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియదు. గతంలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు ప్రభుత్వం మూతపడింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** దసరా పండుగ వేళ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేబినేట్ సమావేశం జరిగింది. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డియర్నెస్ అలవెన్స్, డియర్నెస్ రిలీఫ్ ప్రభుత్వం పెంచింది. 3 శాతం డీఏ పెంపునకు తాజాగా కేబినెట్ ఓకే చెప్పింది. పెరిగిన డీఏ 2025 జులై 1 నుంచి అమలులోకి వస్తుంది.

## మల్లికార్జున్ ఖర్గేకు అస్వస్థత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధ పడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఖర్గే ప్రస్తుతం బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రత్యేక వైద్య బృందం ఆయన చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

## మరోసారి సమ్మె దిశగా కాలేజీలు




**అక్షరటుడే, హైదరాబాద్:** రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి.. రూ. 200 కోట్లే చెల్లించారన్నారు. ఈనెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే సమ్మెకు వెళ్తామని చెప్పారు.

## మద్యం లారీలో మంటలు..




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** మద్యం లోడుతో వెళ్తున్న ఓ లారీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన బుధవారం హైదరాబాద్‌లోని హబ్సిగూడలో జరిగింది. వాహనంలో మంటలు చెలరేగడంతో గమనించిన డ్రైవర్ వెంటనే నిలిపివేశాడు. స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు.

## జీరో బ్యాలెన్స్ అకౌంట్లకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. జీరో బ్యాంక్ ఖాతాదారులకు పలు సేవలను విస్తరిస్తున్నట్లు పేర్కొంది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలకు డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఆర్బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను బుధవారం ప్రకటించింది. ఇందులో భాగంగా జీరో బ్యాలెన్స్ ఖాతాలకు కూడా డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యం అమలు చేయనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఏటీఎం, సీడీఎం మిషన్లలో నగదు డిపాజిట్ చేసే సౌకర్యం కల్పించనున్నారు.

## టీసీఎస్ నుంచి భారీగా ఉద్యోగుల తొలగింపు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశంలోని అగ్రగామి ఐటీ కంపెనీలలో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఉద్యోగాల విషయంలో పెద్ద షాక్ ఇచ్చింది. "ఒకసారి టీసీఎస్‌లో ఉద్యోగం వస్తే.. జీవితాంతం భద్రతే" అని భావించే వారిని నిరాశపరిచే విధంగా, కంపెనీ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. టీసీఎస్ ఇటీవల తన మొత్తం మానవ వనరుల్లో 2 శాతం ఉద్యోగులను తొలగించినట్లు అధికారికంగా ప్రకటించింది. అంటే ఇది సుమారు 12,000 ఉద్యోగాలు. కానీ దాదాపు 80వేల మంది ఉద్యోగులను తొలగించారని సోషల్ మీడియా వేదికగా మాజీ ఉద్యోగులు, ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

## బీసీసీఐకి నఖ్వీ క్షమాపణలు

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ ఫైనల్ తర్వాత జరిగిన పరిణామాలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. టైటిల్‌ను గెలిచిన భారత్.. ట్రోఫీని ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ చేతులమీదుగా తీసుకొనేందుకు భారత క్రికెటర్లు నిరాకరించారు. దీంతో వాటిని తనతోపాటు ఏసీసీ కార్యాలయానికి నఖ్వీ తీసుకెళ్లారు. దీనిపై బీసీసీఐ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈక్రమంలో బీసీసీఐకి క్షమాపణలు చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.

**సినీ ఇండస్ట్రీకి సవాలుగా మారిన పైరసీ భూతాన్ని అరికట్టేందుకు సైబర్ క్రైం పోలీసులు దృష్టి సారించారు. సినిమా, ఓటీటీ పైరసీ కేసులో సీరియస్‌గా దర్యాప్తు చేపట్టారు. ఐబొమ్మ లాంటి వెబ్‌సైట్లతో పాటు పైరసీ చేస్తున్న వారిపై నిఘా పెట్టారు. ఇటీవల థియేటర్‌లో రికార్డ్ చేసే వారితో పాటు సర్వర్లు హ్యాక్ చేస్తున్న ప్రధాన నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సినీ పరిశ్రమ మనుగడకే ప్రమాదకరంగా మారిన పైరసీని అరికట్టాలని చాలా కాలంగా సినీ ప్రముఖులు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, ఇటీవల విడుదలైన చిత్రాలు ఆన్‌లైన్‌లో దర్శనమివ్వడంతో సైబర్ క్రైమ్ పోలీసులు సీరియస్‌గా రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో పైరసీకి పాల్పడుతున్న వారిని అరెస్టు చేశారు. అలాగే, మిగతా సైట్లపైనా దృష్టి సారించారు.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# వదల బొమ్మాళీ

- పైరసీ ఆట కట్టిస్తున్న పోలీసులు
- సినీ ఇండస్ట్రీ మనుగడకు ముప్పుగా మారిన పైరసీ

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న తెలుగు చిత్రాలకు పైరసీ భూతం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వందల కోట్ల పెట్టుబడి పెట్టి హాలీవుడ్ రేంజ్‌లో నిర్మిస్తున్న చిత్రాలు విడుదలైన నిమిషాల్లోనే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. సినిమాలతో పాటు ఓటీటీల్లో వచ్చే వెబ్ సిరీస్‌లు సైతం గంటల వ్యవధిలోనే పైరసీ అవుతున్నాయి. సులువుగా సంపాదనకు అలవాటు పడ్డ కొందరు అక్రమార్కులు సినిమాలను పైరసీ చేస్తున్నారు. ఈ పైరసీ వల్ల ఒక్క 2024లోనే తెలుగు సినీ పరిశ్రమ దాదాపు రూ.3,700 కోట్లు నష్టపోయిందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఇటీవల ప్రకటించారు. థియేటర్లలో రహస్యంగా రికార్డింగ్ చేయడం, డిజిటల్ డిస్ట్రిబ్యూషన్ సర్వర్‌లను హ్యాక్ చేసి హెచ్‌డీ ప్రింట్‌లను దొంగిలించడం వంటి రెండు పద్ధతుల్లో వీరు పైరసీకి పాల్పడుతున్నారు. ఈ పైరసీ సైట్‌లకు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా కోట్ల రూపాయల నిధులు అందుతున్నాయని ఈ లావాదేవీలన్నీ క్రిప్టోకరెన్సీ ద్వారా జరుగుతున్నాయని పోలీసులు వెల్లడించారు.

### అంతర్జాతీయ స్థాయికి..

ఇటీవల కాలంలో తెలుగుతో పాటు దక్షిణాది చిత్ర పరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి సినిమాలు ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటాయి. అలాగే, పుష్ప వంటి సినిమాలు రికార్డులు కొల్లగొట్టాయి. కాంతార, దృశ్యం వంటి చిత్రాలు కూడా రికార్డు స్థాయిలో వసూళ్లు సాధించి భారత సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. వందలు, వేల కోట్ల రూపాయలు వెచ్చించి పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇటీవల కాలంలో పాన్ ఇండియా చిత్రాలు ఎక్కువగా దక్షిణ చిత్ర పరిశ్రమల నుంచే వస్తున్నాయి. టాలీవుడ్, మాలీవుడ్, కోలీవుడ్ తదితర ఇండస్ట్రీలు దూసుకెళ్తుండగా, బాలీవుడ్ కాస్త వెనుకబడింది.

### రంగంలోకి సైబర్ క్రైం..

సినిమా ఇండస్ట్రీ భవిష్యత్తుతో పాటు థియేటర్ల భవితవ్యానికి ప్రమాదకరంగా మారిన పైరసీని నియంత్రించేందుకు పోలీసులు నడుం బిగించారు. ఈ క్రమంలోనే ఒకప్పుడు థియేటర్లలో కెమెరాలతో సినిమాలు రికార్డు చేసే దశ నుండి, ఇప్పుడు ఏకంగా డిజిటల్ మీడియా హౌస్ సర్వర్లను హ్యాక్ చేసి సినిమా ప్రింట్లను దొంగిలిస్తున్న వారిని సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. తాజాగా ఐబొమ్మ నిర్వాహకులను కట్టడి చేయడంపై దృష్టి సారించారు. నిన్నటి వరకు హైదరాబాద్ సీపీ గా పని చేసిన సీవీ ఆనంద్ ఐబొమ్మ వెబ్‌సైట్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వెబ్‌సైట్ నిర్వాహకులు తాజాగా పోలీసులకు సవాల్ విసరడం సంచలనంగా మారింది. దీంతో సీరియస్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వెబ్‌సైట్ కోసం పని చేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో ఐబొమ్మకు ఏజెంట్లు ఉన్నట్లు గుర్తించారు.

## బీసీ రిజర్వేషన్లపై సర్కారుకు చిత్తశుద్ధి లేదు



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఏనాడు జై తెలంగాణ అనని రేవంత్‌రెడ్డి బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొనడం మంచి పరిణామమే అని కవిత అన్నారు. అయితే గిన్నిస్ రికార్డు కోసం బతుకమ్మ వేడుకలు జరపడంపై ఆమె విమర్శలు చేశారు. గతంలో తాము కోటి బతుకమ్మల జాతర చేశామన్నారు. కానీ రికార్డుల కోసం చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పండుగకు బతుకమ్మ చీరలు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. వచ్చే ఏడాది తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో లక్ష మందితో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామన్నారు. అన్నింటా తాను పేరు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే స్థానిక ఎన్నికలపై ఇటీవల బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను కవిత ఖండించారు. బీజేపీ ఎంపీలు మోదీని ఒప్పించి బీసీ రిజర్వేషన్లు అమలు చేయించాలని డిమాండ్ చేశారు. కోర్టులను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడారని అన్నారు.

### ఎస్సీ వర్గీకరణ ఏమైంది?

బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ జాగృతి ఎప్పటి నుంచో పోరాటం చేస్తుందని కవిత అన్నారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల జీవో విడుదల చేయగానే కాంగ్రెస్ నాయకులు కోర్టులో కేసు వేశారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.

## ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే కఠిన చర్యలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రాష్ట్రంలో ఫేక్ న్యూస్, తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన తెలంగాణ డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. అయితే ఫేక్ న్యూస్ ప్రచారం చేసినా, సోషల్ మీడియాలో ఇష్టారీతినా పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడతామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృధికి, పెట్టుబడులు రాకకు లా అండ్ ఆర్డర్ ఎంతో కీలకం అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహిస్తామన్నారు.

## ఆపరేషన్ సిందూర్ ఆపడం ఆశ్చర్యకరం


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను అర్థాంతరంగా ఆపివేయడాన్ని ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. పహల్గామ్ ఘటనకు తగిన బుద్ధి చెప్పాలని ఒక భారతీయుడిగా కోరుకుంటానని, అయితే, కేంద్ర ప్రభుత్వం మధ్యలోనే ఆగిపోవడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ఆయన పూణెలో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన తర్వాత పాకిస్తాన్‌పై సైనిక చర్యను నిలిపివేయడాన్ని ఆయన విమర్శించారు. "ఒక భారతీయుడిగా పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌కు తగిన సమాధానం ఇవ్వడానికి తగిన అవకాశం ఏర్పడింది. అయితే, వారు (కేంద్ర ప్రభుత్వం) ఎందుకు ఆగిపోయారో నాకు ఆశ్చర్యంగా ఉంది" అని ఒవైసీ అన్నారు.





## దేశసేవలో ఆర్ఎస్ఎస్: మోదీ

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశ సేవలో ముందుంటుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న వేడుకల్లో ప్రధాని పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్‌ను డాక్టర్ హెగ్డేవార్ 1925లో విజయ దశమి రోజు ప్రారంభించారు. కొంత మందితో ప్రారంభమైన సంస్థ ఇప్పుడు లక్షల మంది స్వయం సేవకులతో విస్తరించింది. ఈ క్రమంలో శతాబ్ది ఉత్సవాలను దేశవ్యాప్తంగా స్వయం సేవకులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఢిల్లీలో జరిగిన వేడుకలకు హాజరైన మోదీ ఆర్ఎస్ఎస్ సేవలకు గుర్తుగా రూ.100 నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.



## వివాహ బంధంలోకి అవికా గోర్..

పాపులర్ సీరియల్ 'చిన్నారి పెళ్లికూతురు'తో పాన్‌ఇండియా స్థాయిలో గుర్తింపు పొందిన అవికా గోర్ తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. 'లక్ష్మీ రావే మా ఇంటికి', 'సినిమా చూపిస్త మామ', 'రాజుగారి గది 3' తదితర చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. అలాగే హిందీ, కన్నడ సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌ల్లోనూ నటించింది. అయితే అవికా గోర్ గత ఆరేళ్లుగా వ్యాపారవేత్త మిలింద్ చాంద్వానితో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. కాగా.. వీరి ఎంగేజ్‌మెంట్ ఈ ఏడాది జూన్‌లో జరిగింది. ఈ జంట మంగళవారం ముంబైలో జరిగిన వివాహ వేడుకతో ఒక్కటయ్యారు.

—అక్షరటుడే, సినిమా డెస్క్